


# వేడుక - పంతుల జోగారావు

*(ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మార్చి 11- 1988)*

మట్టి ముద్దలు పిసుక్కుంటూ, ఆ వృద్ధుడు చాలా సేపటి నుంచీ అలా అక్కడ కూచుని ఉన్నాడు. ఎండ వేడెక్కుతోంది. నూతి చప్టా క్రింద కూచుని, చేతుల నిండా మట్టి ముద్దలతో అతను - మట్టితో ఆడుకునే అమాయాకపు పసిపిల్లాడిలా ఉన్నారు. ఏడు పదులు పైబడిన వయసులో, అతను పడే అవస్థ చూస్తే ఎవరికయినా ఆశ్చర్యం కలుగక మానదు.

పీక్కుపోయిన చప్పిదవడలు, బట్టతల, సన్నగా పొడుగ్గా ఉన్నారాయన. జీవితంలో ఎగుడు దిగుళ్ళకీ, అనుభవాలకీ ప్రతీకల్లాగ నుదుటి మీద ముడుతలు, చెమట బిందువులు చుక్కలు చుక్కలుగా తలమీదనుంచి నుదుటి మీదకీ, చెవుల పక్కలనుంచి మెడమీదకి కారుతున్నాయి. ఎండిపోయిన పెదవుల చెమట నీరు ఉప్పగా తగులుతోంది. మన్ను పిసుకుతూనే, వీధి తలుపుల వేపు బెంగగా చెవులు రిక్కించి ఉన్నారాయన. ఏక్షణంలోనయినా ఎవరైనా వచ్చి తలుపు తట్టవచ్చు. అందుకే తొందర తొందరగా తన పని ముగించాలని ఆత్రుత అతనిలో పెరిగిపోతోంది. అలసట వల్ల, భయం వల్ల అతని చేతి వ్రేళ్ళు సన్నగా వణుకుతున్నాయి. వ్రేళ్ళ సందులో తడి మన్ను తప తపమని శబ్దం చేస్తుంది.

ఆ మట్టితో గుర్రం బొమ్మ చేయాలని అతని తాపత్రయం. శరీరంలో అణువణువులోని శక్తినీ కూడదీసుకుని, చేస్తున పనిమీద ఏకాగ్ర చిత్తంతో దృష్టి నిలిపి ఉన్నారాయన.

క్రమ క్రమంగా అతని మనోభావాలు ఒక రూపు దాలుస్తున్నట్టుగా, - గుర్రం బొమ్మ తయారు కాసాగింది. అతని మనస్సు అనిర్వచనీయమైన ఆనందంతో నిండిపోతోంది. అది హృదయ సంబంధి!

అప్పుడతను - మహాకావ్య రచన చేస్తున్న అక్షర శిల్పిలా ఉన్నారు. రసానందంతో అతని హృదయం భారమైంది. అప్పుడే పుట్టిన బిడ్డని పొత్తిళ్ళలో గుండెకి చేరువగా, సుతారంగా అదుముకుని, దివ్యానుభూతో పరవశించి పోయే కన్న తల్లిలా అతని కళ్ళు ఆర్ద్రంగా చెమ్మగిల్లాయి.

అంతలో వీధి తలుపుల నెవరో దబదబ బాదసాగారు.

తపో భంగం చెందిన మునిలా కలత చెందిన హృదయంతో లేచి నిలబడ్డారాయన.

✡✡✡

అతని గుండె వేగంగా కొట్టుకుంది. కోడలూ, పిల్లలూ అప్పుడే సినిమా నుంచి వచ్చేసారా! భయంతో అతనికి ఒంటిమీద చెమటలు ధారాపాతంగా కారిపోతున్నాయి. ఒక్కక్షణం సేపు, అతనికేం చేయాలో తోచలేదు.

తలుపు కొడుతున్న చప్పుడు వినిపిస్తూనే ఉంది.

అతను చప్పున పూర్తి రూపం సంతరించుకోబోతున్న ఆ గుర్రం బొమ్మని నూతి వెనుక చెట్ల వెనుక దాచేసారు. చేతులు గబ గబా చెంబుడు నీళ్ళతో కడుక్కున్నారు. ఆ తొందరలో, చేతికంటిన మరకలు ఇంకా పూర్తిగా వదలనే లేదు. మట్టి పిసుకుతున్నప్పుడు పంచ మీద మరకలయ్యాయి. ఈ అవతారంతో తనని చూస్తే కోడలు శివాలెత్తి పోతుంది అడ్డూ ఆపూ లేకుండా నోటికి వచ్చినట్టు తిడుతుంది. పిల్లలు తన వేపొక జంతువుని చూసినట్లు చూస్తారు. అతనికి తనమీద తనకే అసహ్యంవేస్తోంది. దుఃఖం గొంతు దగ్గర గరగరలాడుతోంది.

చేతులు పంచెకు తుడుచుకుంటూ, భయం భయంగా వెళ్ళి తలుపు తీసాడు.

ఎదురుగా పక్కింటి కుర్రాడు. పేపరు కోసం వచ్చాడు. అతనికి గుండె భారం అంతా ఒక్కసారి దిగిపోయినట్లయింది. బాధనెవరో ఒక్కసారి చేత్తో తీసేసినట్లయింది. ఆ అబ్బాయికి పేపరు ఇచ్చి పంపేసాక, వీధి తలుపులు మళ్ళా వేసి, పెరట్లోకి దారి తీసారు. చెట్ల చాటున దాచిన బొమ్మని తీసి చూసారు. గాభరాగా దాచడం వల్ల బొమ్మ రూపం కొద్దిగా చెడింది. దాన్ని మళ్ళీ సరిచేసి, తుది మెరుగులు దిద్దసాగారు.

మరి కాసేపటికి గుర్రం బొమ్మ తయారైంది. ఆనందంతో అతని కళ్ళు అరమోడ్పులయాయి. దానివేపు తృప్తిగా చూసుకుని, ఎవరి కంటా పడని చోట దాన్ని భద్రపరిచారు. చేతికి, పంచెకీ అంటిన మట్టి మరకల్ని శుభ్రంగా కడుక్కుని తన గదిలోకి దారితీసారు.

కుక్కి మంచం మీద నడుం వాల్చి, తను తయారు చేసిన గుర్రం బొమ్మగురించే ఆలోచిస్తూ కళ్ళు మూసుకుని పడుకున్నారతను. చింకి బొంతల మీద పరిచిన పల్చని దుప్పటి మాసిపోయి, అదోరకం వెగటు వాసన వేస్తూంది. తలగడకి గలీబు లేదు. జిడ్డుతో అట్టగట్టి ఉంది. కదిలినప్పుడల్లా మంచం కిర్రుమంటోంది. మంచం పక్కనే విరిగిపడిపోయేలా ఉండే బల్ల మీద అతను వాడాల్సిన మందులున్నాయి. ఎప్పుడో, పదిహేను రోజుల క్రిందట కొడుకు కొని తెచ్చిన మందులవి. వాటిని కూడా పొదుపుగా వాడుకోవలసిందే తను!

మందులయిపోయేయన్న సంగతి కొడుక్కి గుర్తుచేయబోతే, కోడలు కస్సున లేస్తుంది. "అప్పుడే అయిపోయాయా మందులూ? ఎంత డబ్బూ మందులకే చాలడంలేదు. ముసలాయన మందులకే డబ్బంతా పోస్తూ ఉంటే, ఇక సంసారం చేసినట్టే.." అని, రుసరుసలాడుతుంది.

ఆ మాటలు వింటూ ఉంటే ముసిలాయనకి ప్రాణం ఆర్చుకు పోతున్నట్టుంటుంది. మరింక మందుల ఊసెత్తడానికి ధైర్యం చాలదు. కోడలన్నదీ నిజమేననిపిస్తుంది. పోయే కాలమే కానీ, వచ్చేకాలం కాదు కదా, తనకి ఎన్నిమందులు వాడినా, తన పరిస్థితి అలాగే ఉంది, మరి!

తన రోగం మందుల వల్ల తగ్గేది కాదు. ఆ సంగతి తనకి తెలుసు. ఈ ఇంట్లో తనేమీకాడు - తన ఉనికి అందరికీ భారమే! ఆ సంగతి తెలిసి పోవడానికి అట్టే కాలం పట్టనవసరం లేకపోయింది.

భార్య పోయాక, కొడుకు కర్మ కాండ అంతా పూర్తి చేసి, అంతా ముగిసాక, ఆఖరి రోజున అడిగిన మొదటి ప్రశ్న...

"ఇకముందు ఏం చేయదల్చుకున్నారు నాన్నా!" అని.

ఏం చేస్తాడు తను!

ఏడుపు రాలేదు. జీవం లేని నవ్వు పెదాలమీద కదలాడింది.

"మీరొక్కరూ ఈ పల్లెటూళ్ళో ఎందుకు నాన్నా, మా దగ్గరే ఉందురుగాని, వచ్చెయండి -" అనలేక పోయాడు. అలా స్వతంత్రించి అనగలిగే ధైర్యం పెళ్ళయాక వాడికెప్పుడూ లేదు.

కోడలు కలగజేసుకుంటూ అంది: "ఉన్న ఫలాన ఈ ఇల్లూ అదీ వదిలేసి, ఆయన మట్టుకేం వస్తారు? వచ్చినా, ఆయన ఉండేందుకు మన కొంపలో మరో గదికూడా లేదాయె. అంచేత కాస్త పెద్ద కొంప దొరికాక, నింపాదిగా ఆయన రావచ్చులెండి."

ఆ క్షణాన అనిపించింది - తనకట్టె ఈ ఇంటి నుంచే కాటికి వెళ్ళాలి తప్ప - పుట్టి పెరిగిన గ్రామం ఒదలకూడదని.

ఈ ఊరితో తనకెన్నో మధురానుభూతులు పెనవేసుకుని ఉన్నాయి.

ఇక్కడే పుట్టాడు. ఇక్కడే పెరిగాడు. బడిపంతులుగా ఉద్యోగం చేసింది, రిటైరయింది ఇక్కడే పార్వతితో పెళ్ళయింది. మట్టెల చప్పుడుతో ఇల్లంతా కలియ తిరుగుతూ ఉండేది పార్వతి - ఈ ఇంట్లోనే, సుదీర్ఘకాలం తనతో కష్టం సుఖం పంచుకుని, పార్వతి తన చేతుల మీదగానే వెళ్ళిపోయింది, ఇక్కడే నుంచే...

గతం గుర్తొచ్చి, అతని మనసు భారమైంది. వెచ్చటి కన్నీరు అతని చెంపల మీదుగా దిగజారింది.

అతని ప్రమేయం లేకుండానే బాల్య స్మృతులు మళ్ళీ కళ్ళ ముందు కదలాడసాగాయి.

బాల్యం ఎంత సరదాగా గడిచి పోయింది!

భోగి మంటకి కర్రా కంపా సంపాదించడానికి, పడే పాట్లు ఎన్నో! దసరా వేడుకలో బాణాలు పట్టుకుని, పప్పు బెల్లాల కోసం ఇల్లిల్లూ తిరుగుతూ పాడే పాటలు తనకిప్పటికీ గుర్తే!

ఇప్పటి పిల్లల జీవితాల్లో వేగం హెచ్చయింది. వీళ్ళ సరదాలే వేరు. వీళ్ళ ఆటలూ పాటలూ వేరు. పిల్లల సరదాలని కూడా ఒక్కోసారి పెద్దలే నియంత్రించాల్సి రావటం చూస్తుంటే బాధ కూడా కలుగుతూ ఉంటుంది.

తనకెప్పుడూ మనవళ్ళతోనూ, మనవరాలితోనూ తన చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకోవాలని కోరిక బలంగా ఉంటుంది. అప్పటి ఆటలూ, తన సరదాలూ అల్లరి పనులూ, పండుగ ఆర్భాటాలూ వీటి గురించి ఉల్లాసంగా చెప్పాలని మనసు తొందర పెడుతూ ఉంటుంది. కాని, వాళ్ళకంత తీరికేదీ? అథవా, ఉన్నప్పటికి, కోడలు సాగనివ్వదు. ఆమె దృష్టిలో తన చిన్నప్పటి ముచ్చట్లు చాదస్తపు చేష్టల్లా కనిపిస్తాయి. విసుక్కుంటుంది.

"చాల్లెండి.. చదువులూ చట్టబండలూ లేకుండా గాలికీ, ధూళికీ తిరిగే వాళ్ళమని చెప్పుకోడానికి సిగ్గువెయడం లేదూ! వీళ్ళకి ఎంత టైమూ చదువుకోవడానికే సరిపోవడం లేదు. మీ పల్లెటూరి బైతు సరదాలు ఏకరువు పెట్టి పిల్లల్ని చెడగొట్టకండి..."

నిజమే.. ఈ పిల్లలు ఇప్పటి సమాజానికి దర్పణాలుగా పెరగడంలో తప్పులేదు. కాని.. తన అనుభూతులూ, అనుభవాలూ వాళ్ళతో పంచుకోవాలన్న తపన ఎలా నేరమవుతుందో అర్థంకాదు తనకి.

తనతో ఎవరూ మాట్లాడరు.

వేళకి కాఫీ గ్లాసు మనవడు తన గదిలో పెట్టి వెళ్ళిపోతాడు. మందు సీసాల మధ్య అదికూడా మందులాగే అనిపిస్తుంది. భోజనమూ అంతే!... అందరూ తిని వెళ్ళిపోయాక, ఎండిపోయిన మెతుకులు. సయించదు. ఏదో, తిన్నానని అనిపించి, చెయి కడుకోవడం -

అలాంటప్పుడు గుర్తొస్తుంది భార్య!

అలాంటప్పుడు గుర్తొస్తుంది పుట్టిపెరిగిన తన పల్లె!

అలాంటప్పుడు గుర్తొస్తుంది. హరివిల్లు లాంటి తన బాల్యం!

ఏడుపొస్తుంది. గుండె ఛిద్రుపలవుతుంది. మనిషి కోసం, మనిషి సావాసం కోసం తపించిపోతాడు తను. చప్పిదవడల మీద నుంచి కారిన కన్నీరు అట్ట గట్టిన తలగడను తడిపేస్తుంది

ఆ ఊరు వదిలి రాకుండా ఉండాల్సింది. కాని, రాక తప్పలేదు. దినం గడవక తను రాక తప్పలేదు.

పట్నం వచ్చే ముందు, సామాను సర్దుతూ ఉంటే మనసంతా ఏదో చెప్పలేని వెలితితో నిండిపోయింది. ప్రతీ వస్తువునీ ఆప్యాయంగా తడుముతూ కన్నీరు విడిచారు. కదల్చడానికి వీల్లేని సామాను వాళ్ళకీ, వీళ్ళకీ ఇచ్చేసాడు. కొడుక్కి పనికొస్తాయనుకున్న సామాను మాత్రం సిద్ధం చేసాడు.

అప్పుడు కనిపించిందది....

మాసిపోయిన సామ్రాజ్యాలకి చిహ్నంగా, వెలిసి పోయిన కోట గోడ నిలిచినట్టుగా -

వెలిసిపోయిన వర్షానికి గుర్తుగా, కొమ్మమీదా, రెమ్మ మీదా నీటిబొట్టు నిలిచినట్టు -

చిన్నప్పటి ఆట బొమ్మ పెద్దయ్యాక దొరికినట్టు -

అటక మీదనుంచి దించిన కర్ర సామాన్ల మధ్య కనిపించిందది!

గుడి బండి!

దాని మీద కుండీ గుర్రం!

బల్ల చెక్కకి నాలుగువేపులా కర్ర చక్రాలు. దానిమీద తాడుతో కట్టి నిల్చోబెట్టిన గుర్రం బొమ్మ!

దాన్ని చూస్తూనే అలా చాలా సేపు ఉండిపోయాడు తను.

తన రామం దానితో ఆడుకునేవాడు. తమ వేపు గ్రామ ప్రాంతాలలో ఆ పండుగ ఎంత వేడుకుగా జరిగేదని! కుండీ అమావాస్య అని దాని పేరు. మహాలయ అమావాస్యనాడు జరిగేదా పండుగ. పొద్దున్నే తట్టల్లో కుండీ గుర్రాలని పేర్చుకుని, వీధి వీధి తిరిగి అమ్మేవాళ్ళు.

అణాకొకటి - కుండీ గుర్రం!

పిల్లల సంబరం అంతా ఇంతా కాదు. కొత్త బట్టలు వేసుకుని అటకల మీద నుంచి ముందు రోజే దింపి, ధూళీ అదీ దులిపి, సిద్ధం చేసుకున్న గుడబళ్ళ మీద ఆ గుర్రం బొమ్మల్ని కట్టేవాడ్ను. గుడ బండి తాడుచేత బుచ్చుకుని, గుడ గుడ శబ్దం చేస్తూ నాలుగు వీధులూ చుట్టబెట్టేవాళ్ళు - రామం ఆనందానికి పట్టపగ్గాలు ఉండేవి కాదు!

ఈ బండీ, గుర్రం బొమ్మా తీసుకుని వెళ్ళి చూపిస్తే ఎంత ముచ్చట పడిపోతాడో! వీటిని చూపించి, ఆ ముచ్చట్లు చెపుతూ ఉంటే రామంతో పాటు పిల్లలు కూడా ఎంత సంబర పడతారో! చిన్నప్పటి సరదాలు నెమరు వేసుకోవడంతో ఎంత తృప్తి ఉంటుంది?

ఈ ఆలోచన రాగానే, తను తీసికెళ్ళబోయే సామాన్లతో పాటూ ఆ గుడ బండినీ, గుర్రం బొమ్మనీ కూడా భద్రంగా తీసికెళ్ళాలనే నిశ్చయానికొచ్చేరాయన. గుడ బండి దుమ్ము పేరుకుని పోయి ఉంది. గుర్రం బొమ్మని ప్రేమతో తాకబోతే, ఎక్కడి కక్కడ ముక్కలు చెక్కలుగా విచ్చిపోయింది. చేతిలో పొడి పొడిగా చివికి పోతూ, వ్రేళ్ళ సందులలోనుంచి మన్ను రాలిపోయింది. అతని మనసు విలవిలలాడిపోయింది. బాధగా నిట్టూర్చి, చేతులు దులుపుకున్నారు. గుడ బండిని మాత్రం సామాన్లతో సర్దారు.

పట్నంలో కొడుకు ఇంట్లోకి సామాన్లు చేరవేస్తుండగానే కోడలు ఆ గుడ బండిని చూసి, ముఖం చిట్లించుకుంది. ఒక అసహ్యకరమైన వస్తువుని దేన్నో చూసినట్లుగా ముఖం వికారంగా మార్చుకుంది.

పిల్లలంతా దానివేపు ఆసక్తిగా చూసారు. రామం కూడా దాన్ని చూస్తూనే, బాల్య స్మృతులు గుండె అరల్లో పొంగి కాబోలు, ఉత్సాహంగా ఒక అడుగు ముందుకు వేయబోయి, భార్య ముఖం చూసి, వెనకడుగు వేసాడు.

తనా బండిని చూపించి, ఏదో అనబోయేలోగానే -

"ఈ చెత్తంతా మోసుకు రాకపోతే, అక్కడే వదిలేసి రాలేకపోయారా! లంకంత కొంప ఎత్తిపెట్టుకొచ్చినా, ఇంట్లోకి పనికొచ్చే సామాను ఒక్కటీ లేకుండా పోయింది... అంతా మన్నూ మశానం -" అంటూ గొణిగింది.

తన ఉత్సాహమంతా నీరు కారిపోయింది. గుండెనెవరో పిండేసినట్లయింది.

కోడలి ఆగ్రహానికి ఆ గుడ బండి ఎప్పుడో నీళ్ళ పొయ్యి కిందకి ఇంధనంగా వెళ్ళిపోవలసిందే! కాని, తనే మమకారం చావక ఆమె కంట పడకుండా దాన్ని జాగ్రత్త చేసాడు.

ఆ తర్వాత మనవరాలు తల్లిలేని సమయం చూసి, ఆ బండి గురించి ఒకటి రెండుసార్లు ఆసక్తిగా అడిగింది.

"తాతయ్యా! అదేమిటో చెప్పవూ?" అని. చెప్పలేదు తను. చెప్పాలనీ అనిపించలేదు. చెపితే, ఆ పసి మనసు ఉండబట్టలేక, తల్లితో అంటుంది. కోడలు వీరాంగణం ఎత్తుతుంది. పసిపిల్ల మనసు ఉగ్గబట్టలేక దానితో ఆడుకుందామని మారాం చేస్తే, తల్లి చేత దెబ్బలు తినాల్సి వస్తుందేమో కూడా! ఆ భయం చేతనే మనవరాలికి జవాబు చెప్పక ఇన్నాళ్ళూ దాటవేసేవాడు తను. ఆ పిల్ల వదల్లేదు తనని.

రెండురోజుల క్రితం అనాసక్తంగా చూస్తున్న తన దృష్టి, కేలండరులో పండుగల జాబితా మీద పడింది. రెండురోజుల్లో వస్తోంది. అమావాస్య! మహాలయ అమావాస్య!అది చూస్తూనే తనలో ఏదో వింత శక్తి పుంజుకుంది. ఉత్సాహంగా లేచి కూచున్నాడు. మనవరాలిని దగ్గరకి తీసుకుని, గుడ బండీ గురించీ, కుండీ గుర్రం గురించీ, ఆ పండుగ గురించీ వివరంగా చెప్పసాగాడు.

"మా డాడీ చిన్నప్పుడు కుండీ గుర్రం లాగుతూ ఆడుకునే వారా తాతయ్యా?" అమాయకంగా ప్రశ్నించింది మనవరాలు. అవునన్నట్లుగా తను తల ఊపితే, ఆ పిల్ల కళ్ళలో వింత మెరుపేదో మెరిసింది, క్షణం సేపు. ఇంతలో లోపలి నుండి తల్లి పిలుపు కర్కశంగా వినిపించడంతో ఆ పిల్ల ఇంట్లోకి జారుకోవడం జరిగింది.

అప్పుడు కలిగింది - తనకి ఆలోచన!

రాబోయే కుండీ అమావాస్య నాటికి, ఎలాగయినా కుండీ గుర్రం బొమ్మ తయారు చేయాలి తను. ఎవరికీ తెలియనివ్వకుండా చెయ్యాలి గుర్రం బొమ్మని. గుడ బండిమీద దాన్ని కట్టి, రెండురోజులలో రాబోయే మహాలయ అమావాస్య నాడు దాన్ని హఠాత్తుగా అందరికీ చూపించి, ఆశ్చర్య చకితులని చేయాలి! దాన్ని చూస్తూనే పిల్లల సందడి చూడాలి. చిన్నప్పటి స్మృతులు మెదిలి, రామం ముఖంలో వెలిగే మందహాస రేఖ చూడాలి తను!

అప్పుడు రామంలో -

తన అదుపాజ్ఞలలో పెరిగే రామం కనిపిస్తాడు. ఆ అమాయకపు రామం కనిపిస్తాడు. అపేక్షగా తనకి సన్నిహితంగా ఉండే రామం కనిపిస్తాడు.

ఇప్పటి రామం తన కొద్దు -

తన నుంచి మానసికంగా దూరంగా పారిపోయే ఈ రామం తనకొద్దు -

గుడ బండి త్రిప్పుతూ ఇల్లంతా తిరిగే చిన్నప్పటి రామం కావాలి, తనకి! ఆ రామం మళ్ళీ దొరుకుతాడా తనకి?

కనీసం..

ఆ రామాన్ని వాడి పిల్లలలోనయినా చూసుకోగలడా తను?

ముసలాయన ఆలోచనలు అనంతంగా సాగిపోతున్నాయి. ఆ ఆలోచనలకి అడ్డ కట్ట వేస్తూ వీధి తలుపు చప్పుడయింది.

ఈసారి వచ్చింది కోడలే.. సినిమా వదిలేసారు కాబోలు...

"సినిమా ఎలా ఉందమ్మా?" ఆప్యాయంగా అడిగాడు.

అతనికి సమాధానం చెప్పాల్సిన అవసరమే లేనట్టుగా ఓ చూపు విసిరి, చర చరా ఇంట్లోకి దారి తీసిందామె. పిల్లలు ఆమెను అనుసరించారు.

అప్పుడతనికి ఎందుకో - పాత పడిపోయి, తన చేతిలో నుగ్గు నుగ్గుగా మన్ను, గుండ గుండగా రాలిపోయిన కుండీ గుర్రం బొమ్మ గుర్తొచ్చింది.

✡✡✡

ముసలాయనకి నిద్రపట్టడంలేదు. కిటికీలోనుంచి ఈదురు గాలి విసురుగా తగులుతోంది. వర్షం ముంచుకొచ్చేలా ఉంది. రాత్రి పదకొండు దాటుతోంది. లోపలి గదిలో లైటు తీసేసి ఉంది. అంతా నిద్రపోతున్నారు. తనకే నిద్రపట్టడంలేదు.

మంచం క్రిందకి దిగి, తొంగి చూసారు. గుడ బండి మీద తన స్వహస్తాలతో చేసిన గుర్రం బొమ్మ కనిపించింది.

అతని గుండెలో ఆ రోజు ఉదయం ఎదురయిన చేదు అనుభవం తుమ్మ ముల్లులా గుచ్చుకుంటోంది.

ఆ వేళ - మహాలయ అమావాస్య బండినీ, గుర్రం బొమ్మనీ అందరికీ చూపించి, ఆనందం పంచుకోవాలని ఎదురు చూసిన రోజు!!

ఆ ఉదయాన్నే కాఫీల వేళప్పుడు వంట గదిలోకి వెళ్ళారతను. ఎప్పుడూ రాని వ్యక్తి ఆవేళప్పుడు రావడంతో కొడుకూ, కోడలూ అదోలా చూసారు.

"కాఫీ ఇంకా కాచలేదు. -" పుల్ల విరిచినట్లుగా అంది కోడలు. ముసలాయన ముఖంలోకి రక్తం ఎగజిమ్మినట్టయింది.

ఉత్సాహంతో, అదేమంతగా పట్టించుకోదలచుకోలేదు.

"ఇవాళ మహాలయ అమావాస్యమ్మా - మన గ్రామంలో మీ అత్తగారుండే రోజులలో ఈ పండుగ ఎంత సరదాగానో చేసుకునే వాళ్ళం"

అతని మాటలకి అడ్డొస్తూ, మూతి తిప్పుతూ అంది కోడలు: "అహో! అలాగా! ఇప్పుడొచ్చే పండుగలే చెయ్యలేక నా నడుం పీక్కుపోతుంది. ఇంక - మీ కాలం నాటి పాత చింతకాయ పండుగలన్నీ జరుపుకోవాలంటే నా వల్ల కాదు. -" అంది కఠినంగా.

దెబ్బతిన్న పక్షిలా విలవిలలాడి పోయాడు తను!

"అది కాదమ్మా పిండి వంటలూ అవీ చెయ్యమని కాదు నా ఉద్దేశం - మా రామం చిన్నప్పుడు ఈ పండుగనాడు గుడ బండి వీధుల్లో త్రిప్పుతూ.." అంటూ ఏదో చెప్పబోయాడు.

లిప్త కాలం రామం కళ్ళు మెరిశాయి. భార్య కంటి ఎరుపులో ఆ మెరుపు మాసిపోయింది!

"మళ్ళీ ఆ ముదనష్టపు బండి ఊసు తెచ్చారూ? దాన్నప్పుడే విరిచి పోగులు పెట్టి పొయ్యిలో పెట్టేసాను కాను.. పీడా పోయేది. ఛీ..ఛీ.. వెధవలేకి ఆటలూ, పల్లెటూరి సరదాలునూ - ఇంత వయసొచ్చినా, 'మా కాలం నాడయితే..' అంటూ సన్నాయి నొక్కులు నొక్కడం మానరు - ఏం మనుషులో! " కోడలు దులపరిస్తూ అక్కడి నుండి వెళ్ళిపోయింది.. ఆమె వెనుకే రామం, పిల్లలూనూ..

ఉదయం జరిగిన సంఘటన గుర్తొచ్చి, అతని కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. మనసు బాధగా మూలుగుతోంది. అశాంతిగా అటూ ఇటూ ఒత్తిగిల్లారు.

కిర్రు మంచం అతన్ని ఓదార్చలేదు.

✡✡✡

"డాడీ, తాతగారు కనిపించడంలేదు!"

చదువుకోడానికి తెల్లవారు ఝామున లేచిన రామం పెద్దకొడుకు ముందు గదిలో కిర్రుమంచం ఖాళీగా ఉండడం గమనించి, గాభరాగా తండ్రిని నిద్రలేపాడు.

త్రుళ్ళిపడి లేచాడు రామం. అతని భార్య, మిగతా పిల్లలు కూడా లేచి కూర్చున్నారు.

రామం తొట్రుపాటుతో ముందు గదిలోకి వెళ్ళాడు. మంచం ఖాళీగా ఉంది. ఇల్లూ, పెరడూ అంతా వెతికినా, ముసలాయన జాడలేదు. రామంలో ఆత్రుత పెరిగిపోతోంది. పిల్లలు ఏడుపు లంకించుకున్నారు.

"ఈయన ఏ అఘాయిత్యం తలపెట్టలేదుకదా? - వెళ్ళి వెతకండి.." అంది రామం భార్య గాభరాగా.

రామం టార్చి లైటు తీసుకుని, వీధిలోకి బయలుదేరాడు. మగపిల్లలిద్దరూ అతనిని అనుసరించారు.

రాత్రంతా విడవకుండా వర్షం పడిందేమో, నేలంతా చిత్తడిగా ఉంది. రొజ్జ గాలి ఒంటిని ఝుళ్ మనిపిస్తూంది. చీకటి తెరలు విడివడి, అప్పుడే కొద్దికొద్దిగా వెలుతురు వస్తోంది.

తండ్రిని వెతుకుతూ వస్తున్న రామం, ఆ వీధి మలుపు తిరుగుతూనే ఆగిపోయాడూ.

అక్కడ..

ప్రహరీ గోడనానుకుని, కుప్పకూలిపోయి ఉన్న ఆకారాన్ని చూసి, అతనికి రక్తప్రసరణం ఆగిపోయినట్లయింది.

టార్చి లైటు వెలుగులో తండ్రిని పోల్చుకుని, అతనిలో దుఃఖం పెల్లుబికి వచ్చింది. "నాన్నా!" అంటూ అరిచాడు ఆందోళనగా, పిల్లలు ఘొల్లుమన్నారు.

వర్షంలో, చీకట్లో తండ్రి అసలింత దూర ఎందుకు వచ్చారో అతనికర్థం కాలేదు. టార్చిలైటు పెద్ద కొడుకు చేతికిచ్చి, నీరు ఓడుతున్న తండ్రి శరీరాన్ని రెండు చేతుల్తో లేవనెత్తబోయాడు. చలనం లేకుండా బరువెక్కిన తండ్రి దేహం భుజం మీదకి భారంగా చేర్చి, పొదవి పట్టుకున్నాడు.

తండ్రిని లేవనెత్తబోతూ ఉంటే - తండ్రి కుడిచేతిలో మూసిన గుప్పెట్లో బిగించి పట్టుకున్న తాడు రామం చేతిని చుట్టుకుంది. పెను పామేదో చేతికి చుటుకున్నట్టుగా అదిరిపడి, విదిలించబోయాడు. తాడుతో పాటూ లేస్తూ చప్పుడు చేసింది గుడ బండి!

"నాన్నా! అటు చూడు!..." పిల్లలు ఆశ్చర్యంలో అరిచారు. టార్చి వెలుగులో అటువైపు ఉద్విగ్నంగా చూసాడు రామం.

యజమాని వెంట తోకాడిస్తూ విశ్వాసంగా తిరిగే కుక్కపిల్లలా ఉంది - తడిసిన గుడ బండి!

దానిమీద -

రాత్రంతా ముసిలాయనతో నాలుగు వీధులూ ఊరేగి, రాత్రంతా కురిసిన వర్షానికి తడిసి, నానిపోయిన గుర్రం బొమ్మ -

ఇప్పుడది - పిడికెడు మట్టి ముద్ద!

✡✡✡